సాక్షి
మెదక్
శుక్రవారం । 21 । ఫిబ్రవరి । 2025



పెద్ద బండి.. భలే ఉందండి

నార్సింగి జాతీయ రహదారిపై 160 టైర్లతో కూడిన భారీ వాహనం ఆకట్టుకుంది. గురువారం మధ్యాహ్నం రైస్‌మిల్లుల సమీపంలోని సర్వీస్‌రోడ్డుపై డ్రైవర్లు వాహనాన్ని నిలిపి కొద్దిసేపు సేదతీరారు. దీంతో జాతీయ రాహదారిపై రాకపోకలు సాగించేవారు ఆసక్తిగా గమనించారు. హైదారాబాద్ నుంచి యూపీలోని ఝూన్సీకి 280 టన్నుల తోషిబా కంపెనీ భారీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఈ వాహనంలో తరలిస్తున్నారు. ఈ కంటైనర్ గంటకు 20 కిలోమీటర్ల వేగంతో రోజుకు 40 నుంచి 60 కిలోమీటర్లు ప్రయాణించనుంది. – చిన్నశంకరంపేట(మెదక్)

న్యూస్‌రీల్

నేడు తూప్రాన్‌కు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రాక

మనోహరాబాద్(తూప్రాన్): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శుక్రవారం తూప్రాన్‌కు రానున్నారని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ తెలిపారు. అభ్యర్థి అంజిరెడ్డి తరపున ప్రచారంలో పాల్గొంటారని.. అలాగే పలువురు పట్టభద్రులు, పార్టీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారని చెప్పారు. ఎంపీ రఘునందన్ రావు, పలువురు ప్రముఖులు సైతం హాజరవుతారని వివరించారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్

చిలప్‌చెడ్(నర్సాపూర్): పదో తరగతి పరీక్షలకు సమయం దగ్గర పడుతున్నందున విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలని డీఈఓ రాధాకిషన్ అన్నారు. గురువారం మండలంలోని సోమక్కపేట్, ఫైజాబాద్, చిట్కుల్ ఉన్నత పాఠశాలతో పాటు కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ప్రత్యేక తరగతులు, నమూనా పరీక్షల గురించి చర్చించారు. ఈసందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. చదువుతోనే సమాజంలో గౌరవం లభిస్తుందని.. సబ్జెక్ట్ విషయంలో ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత ఉపాధ్యాయుడితో నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ విఠల్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ డబ్బులు రికవరీ

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం మాసాయిపేటకు చెందిన శేషుని పెంటమ్మ తన పెన్షన్ డబ్బులు స్వాహా చేశారంటూ బుధవారం కెనరా బ్యాంకు ఎదుట నిరసన తెలిపిన విషయం తెలిసిందే. అయితే పెన్షన్ డబ్బులు తానే డ్రా చేశానంటూ అదే గ్రామానికి చెందిన రాజమ్మ గురువారం రూ. 12 వేలను బ్యాంకుకు స్వయంగా వచ్చి అందజేసిందని బ్యాంకు మేనేజర్ నవీన్‌రెడ్డి తెలిపారు. రికవరీ అయిన డబ్బులను బాధితురాలి అకౌంట్‌లో జమ చేయనున్నట్లు వెల్లడించారు. అక్రమమార్గంలో వృద్ధురాలి పెన్షన్ డబ్బులు డ్రా చేసిన ఘటనలో బ్యాంకు సిబ్బంది పాత్ర ఉన్నట్లు తేలితే చర్యలు తీసుకుంటామన్నారు.

ఉద్యోగులు సంఘటితంగా ఉండాలి



సభ్యులకు నియామకపత్రాలు అందజేస్తున్న సంఘం నాయకులు

మెదక్‌జోన్: ఉద్యోగులు సంఘటితంగా ఉండాలని నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సర్వ సభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రశాంత వాతావరణంలో ముందుకు తీసుకెళ్లే క్రమంలో నాల్గవ తరగతి ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. అనంతరం టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు నరేందర్ మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల సాధనకు సంఘం ఎప్పుడు ముందు వరుసలో ఉంటుందన్నారు. అనంతరం నాల్గవ తరగతి ఉద్యోగులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జలగం ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఎండీ. రిజ్వాన్ అలీ తదితరులను ఎన్నుకున్నారు.

డంప్‌యార్డుతో అనేక ఇబ్బందులు

నర్సాపూర్: గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంప్‌యార్డుతో ప్రజలకు అనేక ఇబ్బందులు ఎదురవుతాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మల్లేశం అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీయడానికే డంప్‌యార్డు ఏర్పాటు చేస్తున్నట్లుగా ఉందన్నారు. భూగర్భజలాలు, అడవులు పాడవుతాయని, నర్సాపూర్ రాయరావు చెరువు కలుషితమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి నాగరాజు, జిల్లా కార్యదర్శి కాలేక్, లోక్‌సత్తా, బీఎస్పీ నాయకులు చంద్రశేకర్, నాగేందర్, జనార్దన్, దుర్గయ్య, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ



ఫిర్యాదు అందజేస్తున్న సంఘం డైరెక్టర్లు

రామాయంపేట(మెదక్): మండలంలోని కోనాపూర్ సహకార సంఘంలో నిధుల దుర్వినియోగానికి సంబంధించి గురువారం సంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ అంజ్యా విచారణ చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. సొసైటీలో రూ. 2.21 కోట్ల మేర అవినీతి జరిగిందని 2022లో అప్పటి డైరెక్టర్లు కొందరు ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. మార్చి 10లోగా విచారణ పూర్తి చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని వెల్లడించారు.

ఎల్‌ఆర్‌ఎస్.. ఆఫర్

- ప్లాట్ల కొనుగోలుదారులకు 25 శాతం రాయితీ
- మార్చి 31 వరకు గడువు
- జిల్లావ్యాప్తంగా 21,459 దరఖాస్తులు
- పరిశీలన పూర్తయినవి 1,691

ఎల్‌ఆర్‌ఎస్ (లే అవుట్ల క్రమబద్ధీకరణ పథకం) వేగవంతానికి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అక్రమ లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి రిజిస్ట్రేషన్ ఫీజులో 25 శాతం రాయితీ ప్రకటించింది. దీనికి మార్చి 31లోపు గడువు విధించింది. పైగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే నేరుగా ఫీజును చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించింది.



మెదక్‌జోన్: జిల్లావ్యాప్తంగా 21 మండలాలతో పాటు మెదక్, రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపాలిటీల్లో ఐదేళ్ల కాలంలో 21,459 మంది ప్లాట్లను కొనుగోలు చేశారు. వీరంతా మీసేవ కేంద్రాల ద్వారా క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలోనే ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ ప్రారంభం కాగా కోర్టు కేసుతో 2022లో నిలిచిపోయింది. అనంతరం ఈ స్కీంపై ప్రభుత్వం దృష్టి పెట్టలేకపోయింది. 2023లో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎల్‌ఆర్‌ఎస్‌పై నిర్ణయం తీసుకుంది. ప్లాట్లను మూడు శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సక్రమంగా ఉంటేనే క్రమబద్ధీకరణ చేస్తామని చెప్పింది. లేకుంటే తిరస్కరిస్తామని తెలిపింది.

ఫీజు చెల్లించింది 144 మంది మాత్రమే

నాలుగు మున్సిపాలిటీల పరిధిలో 14,756 మంది, గ్రామీణ ప్రాంతంలో 6,703 మంది ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. కాగా ఇందులో మున్సిపాలిటీల పరిధిలో మూడు నెలల వ్యవధిలో అధికారులు 1,129 దరఖాస్తులను పరిశీలించారు. అందులో 282 సక్రమంగా లేవని తిరస్కరించారు. 842 దరఖాస్తులకు అనుమతి ఇచ్చారు. కానీ అందులో కేవలం 141 మంది మాత్రమే ఫీజు చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకున్నారు. ఇంకా 701 మంది ముందుకు రాలేదు. అలాగే గ్రామీణ ప్రాంతంలోని 21 మండలాల పరిధిలో 6,703 మంది దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు 562 దరఖాస్తులకు అనుమతి ఇవ్వగా.. అందులో కేవలం ముగ్గురు మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

వేగవంతం కానున్న ప్రక్రియ..!

ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ వేగవంతం అవుతుందని పలువురు పేర్కొంటున్నారు. అయితే మార్చి 31 వరకు మాత్రమే గడువు ఇవ్వడంతో, ఆలోగా పూర్తిస్థాయిలో దరఖాస్తులు పరిశీలించటం సాధ్యమవుతుందా..? అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే ప్లాట్లను మూడు శాఖల అధికారులు పరిశీలించిన తర్వాతే క్రమబద్ధీకరణకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. 40 రోజుల గడువు మాత్రమే ఉండటంతో దరఖాస్తుదారులు ముందుకు వస్తే అందుకు తగిన ఏర్పాట్లు చేసి, స్పెషల్ డ్రైవ్ చేపట్టే యంత్రాంగం ప్రస్తుతం అందుబాటులో లేదని తెలుస్తోంది.

పంట రుణాల మంజూరులో వివక్ష



బ్యాంక్ మేనేజర్‌ను నిలదీస్తున్న అఖిలపక్ష నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): వ్యవసాయ రుణాల మంజూరులో మాసాయిపేట కెనరా బ్యాంక్ మేనేజర్ నవీన్ రెడ్డి వివక్ష చూపుతున్నారని అఖిలపక్ష నాయకులు ఆరోపించారు. ఈ మేరకు గురువారం బ్యాంక్ మేనేజర్‌ను నిలదీశారు. నిబంధనల మేరకే సిబిల్ లేని రైతులకు రుణాలు మంజూరు చేయడం లేదని మేనేజర్ చెప్పడంతో లిఖితపూర్వకంగా రాసి ఇవ్వాలని పట్టుబట్టారు. ఈసందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ రుణమాఫీ పొందిన రైతులకు తిరిగి రుణాలు చెల్లించడంలో మేనేజర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రైతుభరోసా డబ్బులను సైతం గోల్డ్ రుణాల కింద జమ చేయడంతో వ్యవసాయ పెట్టుబడికి రైతులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. రుణమాఫీ వర్తించిన రైతులకు తిరిగి రుణాలు రీ షెడ్యూల్ చేయడంతో పాటు రైతు భరోసా డబ్బులను ఇతర రుణాల కింద జమ చేయవద్దని ఓ వైపు ప్రభుత్వం ఆదేశిస్తున్నా, ఇవేమీ పట్టనట్లు మేనేజర్ వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.



దుబ్బాక: మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు కుటుంబసమేతంగా మహాకుంభమేళాకు వెళ్లారు. ఈ సందర్భంగా గురువారం ప్రయాగ్‌రాజ్ వద్ద త్రివేణి సంగమములో పుణ్యస్నానాలు ఆచరించారు.

ఏడుపాయల అసిస్టెంట్ ఈఓగా అంజయ్య

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల అసిస్టెంట్ ఈఓగా అంజయ్యను నియమిస్తూ దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కొండగట్టు అంజనేయ స్వామి ఆలయ ఈఓగా పనిచేస్తూ జనవరి 31వ తేదీన పదవీ విరమణ చేసిన అంజయ్యను అసిస్టెంట్ ఈఓగా రెండేళ్ల కోసం నియమించారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.78 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న సభ్యులు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి హుండీ ఆదాయం రూ.78 లక్షలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి రామాంజనేయులు తెలిపారు. గురువారం ఆలయ ముఖ మండపంలో హుండీలలోని కానుకలను లెక్కించారు. 19 రోజులలో నగదు రూ.78,31,047, విదేశీ కరెన్సీ నోట్లు 130, మిశ్రమ బంగారం 82 గ్రాములు, మిశ్రమ వెండి 5 కిలోల 100 గ్రాములు, పసుపు బియ్యం13 క్వింటాళ్లు వచ్చినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్ ఆలయ ధర్మకర్తలు, లలిత సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

సమష్టిగా పని చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జ్ఞానేశ్వర్, చిత్రంలో ఆంజనేయులుగౌడ్ తదితరులు

ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్

నర్సాపూర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపునకు అందరూ సమష్టిగా పనిచేయాలని రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ అన్నారు. గురువారం పట్టణంలో నిర్వహించిన పట్టభద్రుల నియోజకవర్గస్థాయి ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీ కోసం పని చేసే కార్యకర్తలకు కాంగ్రెస్‌లో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు అందుబాటులో ఉంటానని తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలన అవినీతిమయమైందని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బున్న వ్యక్తులకే బీజేపీ ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ సేవ చేసే వ్యక్తికి అవకాశం కల్పించిందన్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ.. నరేందర్ రెడ్డిని గెలిపించేందుకు అందరం కలిసికట్టుగా పని చేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను పట్టభద్రులకు వివరించి నరేందర్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు భవాని, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేష్, నాయకులు రాజుయాదవ్, కరుణాకర్‌రెడ్డి, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

338మంది కార్మికులపై వేటు!

- సదాశివపేటలోని ఓ ప్రైవేటు టైర్ల పరిశ్రమ సంచలన నిర్ణయం
- ఆందోళనకు దిగిన కార్మికులను తొలగించిన యాజమాన్యం
- చర్చలు జరుపుతున్నాం: డిప్యూటీ కమిషనర్

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: సదాశివపేట శివారులోని ఓ ప్రైవేటు టైర్ల పరిశ్రమ యాజమాన్యం సంచలన నిర్ణయం తీసుకుంది. తమను క్రమబద్ధీకరించాలంటూ ఆందోళనకు దిగిన 338మందికి పైగా కార్మికులపై వేటు వేసింది. ఈ ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నాలుగేళ్ల క్రితం యాజమాన్యం శిక్షణ పేరుతో నిరుద్యోగ యువతను ఉద్యోగాల్లోకి తీసుకుంది. అప్పట్నుంచి వీరిని పర్మినెంట్ చేయకుండా ట్రైనీగానే పనిచేయించుకుంటూ నెలకు రూ.14వేలు మాత్రమే చెల్లిస్తోంది. ఇన్నాళ్లు తక్కువ వేతనమిచ్చినా సర్దుకుపోయామని, తమను పర్మినెంట్ చేయాలంటూ ఆందోళనకు దిగడంతో సదరు పరిశ్రమ ఒక్కసారిగా వీరందరినీ ఉద్యోగాల నుంచి తొలగించింది. దీంతో ఆ కార్మిక కుటుంబాలన్నీ రోడ్డున పడ్డాయి. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వ శాఖ డీఆర్‌డీఏ (జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ) అప్పట్లో నిర్వహించిన జాబ్‌మేళాలో ఈ ఉద్యోగాలు పొందారు. నిబంధనల ప్రకారం ఒకటి రెండేళ్లకు మించి ట్రైనీగా కొనసాగించరాదు. నాలుగేళ్లుగా అరకొర వేతనాలతో ట్రైనీగా కొనసాగిస్తూ తమను శ్రమ దోపిడీకి గురి చేస్తోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

22న మరోసారి చర్చలు!

ఉద్యోగాలు పోయిన సుమారు 338 మంది కార్మికులు వారం రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. కార్మికశాఖ అధికారులకు కూడా వినతిపత్రాలు అందజేశారు. ఆ శాఖ అధికారులు ఇప్పటికే పలుమార్లు యాజమాన్యంతో చర్చలు జరపగా, కంపెనీ ప్రతినిధులు ఇంకా ఎటూ తేల్చడం లేదు. ఈ నెల 22న మరోసారి చర్చించాలని నిర్ణయించారు.

చర్చలు జరుపుతున్నాం

సుమారు 338 మందికిపైగా ట్రైనీలను ఉద్యోగాల్లోంచి తొలగించడంతో సంబంధిత కంపెనీ యాజమాన్యంతో చర్చలు జరిపాం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 22న మరోసారి చర్చలు జరుపుతాం. ట్రైనీగా ఎన్ని రోజులు కొనసాగించాలనే దానిపై నిర్ణీత నిబంధనలేవీ లేవు. చర్చలు ఫలించకపోతే లేబర్ కోర్టుకు రిఫర్ చేస్తాం.

–శ్రీనివాస్‌రెడ్డి, కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

కలెక్టర్ రాహుల్‌రాజ్



చిన్నశంకరంపేట: రైతులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

చిన్నశంకరంపేట(మెదక్): వ్యవసాయ అధికారులు వరి పంటలను నిత్యం క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలో వరి పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడి పంటలకు సోకుతున్న తెగుళ్లపై ఆరా తీశారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారులు సైతం నిత్యం పంట పొలాలను పరిశీలించి రైతులను అప్రమత్తం చేయాలన్నారు. జిల్లాలో అత్యధిక శాతం రైతులు వరి పంటనే సాగుచేస్తున్నారని తెలిపారు. ఈసందర్భంగా ఏఓ ప్రవీణ్‌కు పలు సూచనలు చేశారు. అనంతరం చేగుంటలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వానాకాలంలో ఆస్పత్రి స్లాబ్ నుంచి నీరు వస్తుందని డాక్టర్ అనిల్‌కుమార్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. జిల్లా వైద్యాధికారితో మాట్లాడి మరమ్మతుల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.

ఓటరు స్లిప్‌లు పంపిణీ చేయాలి

మెదక్ కలెక్టరేట్: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు స్లిప్‌లు పంపిణీ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గురువారం హవేళి ఘణాపూర్ తహసీల్దార్ సింధు రేణుక కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసి ఓటర్ స్లిప్ అందజేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తయిన తర్వాత రిపోర్టు సమర్పించాలని ఆదేశించారు. పట్టభద్రులు, టీచర్లు ఈనెల 27న ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.

జాతరలో ప్లాస్టిక్ కనిపించొద్దు

అదనపు కలెక్టర్ నగేష్



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

పాపన్నపేట(మెదక్): అధికారులు సమన్వయంతో పనిచేసి ఏడుపాయల జాతరను జయప్రదం చేయాలని అదనపు కలెక్టర్ నగేష్ పిలుపునిచ్చారు. గురువారం ఏడుపాయల్లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈనెల 26 నుంచి ప్రారంభమయ్యే జాతరకు సుమారు 10 లక్షలకు పైగా భక్తులు వస్తారని చెప్పారు. ఏ షాపులో ప్లాస్టిక్ కనిపించొద్దని ఆదేశించారు. ఇప్పటికే ప్లాస్టిక్ కవర్లు ఉంటే వాటిని తమకు అప్పగిస్తే బదులుగా పేపర్ కవర్లు ఇస్తామని సూచించారు. జాతర పరిసరాల్లో మరిన్ని శౌచాలయాలు ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ ప్రదేశాల నుంచి నడవలేని వ్యక్తుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. లడ్డూ, పులిహోర కేంద్రాల వద్ద ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని చెప్పారు. ఆలయం వద్ద తొక్కిసలాట జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 24 వరకు ఏర్పాట్లు పూర్తి కావాలని ఆదేశించారు. సమావేశంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, డీఎల్పీఓ సురేష్ బాబు, ఈఓ చంద్రశేఖర్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధతో వచ్చే వారికి భరోసా ఇవ్వాలి

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

హవేళిఘణాపూర్(మెదక్): ఏదైనా సమస్యతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు మేమున్నామంటూ భరోసా ఇచ్చి వారి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మెదక్‌రూరల్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేసి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. నేర ప్రవృత్తి గల వారిపై నిఘా పెట్టాలని, అనుమానితుల సమాచారాన్ని సేకరించాలని సిబ్బందికి సూచించారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ వారు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. డయల్ 100 కాల్స్ వచ్చిన వెంటనే తక్షణమే స్పందించి సంఘటన స్థలానికి చేరుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, మెదక్‌రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ మురళి, సిబ్బంది ఉన్నారు.

పక్వానికి వచ్చిన పంటనే కోయాలి

డీఏఓ వినయ్ విన్సెంట్

నర్సాపూర్/చిలప్‌చెడ్: పూర్తిస్థాయిలో పక్వానికి వచ్చిన పంటలనే రైతులు కోయాలని జిల్లా వ్యవసాయ అధికారి వినయ్‌కుమార్ విన్సెంట్ సూచించారు. గురువారం రైతు వేదికలో పంట కోత, ధాన్యం కొనుగోలు సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కోతల సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, చెత్త రాకుండా హార్వెస్టర్ బ్లోవర్ ఆన్‌లో ఉంచాలని చెప్పారు. ధాన్యాన్ని సరిగా ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తరలించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ సంధ్యారాణి, మండల వ్యవసాయాధికారి దీపిక, ఏఈఓలు నిరోషా, దుర్గాప్రసాద్, రవివర్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే చిలప్‌చెడ్ మండల పరిధిలోని శీలాంపల్లి, చిట్కుల్ రైతులకు పలు సూచనలిచ్చారు. పంటల సాగు విషయంలో సందేహాలుంటే వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ రాజశేఖర్‌గౌడ్, ఏఈఓలు కృష్ణవేణి, దివ్య, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంతర్జాతీయ సదస్సుకు పరిశోధనా పత్రం ఎంపిక


మదన్‌మోహన్‌

సిద్దిపేటఎడ్యుకేషన్‌: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్‌ కళాశాల సూక్ష్మజీవశాస్త్ర విభాగాధిపతి డా. మదన్‌మోహన్‌ పరిశోధనా పత్రం నేపాల్‌లో 24, 25 తేదీల్లో నిర్వహించనున్న అంతర్జాతీయ బయోటిక్నాలజీ సదస్సుకు ఎంపికైంది. ఈ సందర్భంగా గురువారం మదన్‌మోహన్‌ మాట్లాడుతూ.. మేడారం జాతర సమయంలో జంపన్న వాగు నీటి కాలుష్యంపై పుణ్యస్నానాల ప్రభావం అనే అంశం తీసుకొని తాను చేసిన పరిశోధనా పత్రాన్ని మన దేశం తరపున సదస్సులో ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ సునీత, వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ అయోధ్యరెడ్డి, సీఓఈ డా. గోపాల సుదర్శనం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్‌ డా.మధుసూదన్‌, ఇతర అధ్యాపకులు మదన్‌మోహన్‌ను అభినందించారు.

అన్నీ ఉన్నా వృద్ధాశ్రమాలను ఆశ్రయించడం బాధాకరం

- జిల్లా జడ్జి స్వాతిరెడ్డి


వృద్ధులతో మాట్లాడుతున్న జడ్జి స్వాతిరెడ్డి

కొండపాక(గజ్వేల్‌): చట్టాలపై అవగాహన ఉంటే సుఖమయమైన జీవితాన్ని గడపవచ్చని సిద్దిపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా జడ్జి స్వాతిరెడ్డి పేర్కొన్నారు. కొండపాకలోని ఆనంద నిలయం, వృద్ధాశ్రమం, బాల సదనాన్ని గురువారం సందర్శించారు. లీగల్‌ సర్వీస్‌ అథారిటీ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. అంతకు ముందు వృద్ధాశ్రమంలో ఉండటానికి గల కారణాలు. ఇబ్బందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్వాతిరెడ్డి మాట్లాడుతూ.. వృద్ధాశ్రమాలు ఏర్పడటం కొంత వరకు సంతోషాన్ని, మరి కొంత వరకు బాధను కల్గిస్తాయన్నారు. అన్నీ ఉన్నా అనాథల్లా కొందరు వృద్ధాశ్రమాలను ఆశ్రయించడం బాధాకరమన్నారు. అనాథ పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు బాల సదనంను స్థాపించిన వారిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో లీగల్‌ సెల్‌ ఎయిడ్‌ కౌన్సిల్‌ కృష్ణమోహన్‌, ఎస్సై శ్రీనివాస్‌, వృద్ధాశ్రమ నిర్వహన ప్రతినిధులు పెద్ది వైకుంఠం, బెజగామ వెంకటేశం పాల్గొన్నారు.

కార్మికుల శ్రేయస్సే సీఐటీయూ లక్ష్యం

- రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్‌



మాట్లాడుతున్న మల్లికార్జున్‌

శివ్వంపేట(నర్సాపూర్‌): కార్మికుల శ్రేయస్సు సీఐటీయూ లక్ష్యమని, కార్మిక సంఘం ఎన్నికల్లో సీఐటీయూ నాయకులను గెలిపించాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు జే.మల్లికార్జున్‌ తెలిపారు. గురువారం మండలంలోని శభాష్‌పల్లి సమీపంలో గల సుగుణ ఫుడ్స్‌ పరిశ్రమలో గుర్తింపు ఎన్నికల సందర్భంగా కార్మికులతో గేట్‌ మీటింగ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులను పర్మినెంట్‌ చేసిన ఘనత సీఐటీయూదే అన్నారు. గెలిపిస్తే పరిశ్రమల్లో కార్మికుల శ్రమ దోపిడీని అడ్డుకుంటామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడి కనీస వేతనాలు అమలయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఏ.మల్లేశం, నాయకులు యాదగిరి, మల్లాగౌడ్‌, భాస్కర్‌ తదితరులు పాల్గొన్నారు.

కమ్మనైనది.. అమ్మ భాష

- మాతృభాషను మించిన మరొక భాష లేదు
- కాపాడుకుంటేనే మనుగడ
- అభివృద్ధికి కృషి చేస్తున్న కవులు, రచయితలు

నేడు ప్రపంచ మాతృభాష దినోత్సవం


తెలుగుభాష అభివృద్ధికి కృషి చేస్తున్న కవులు, ఉపాధ్యాయులు

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): మాతృభాషను మించి మరొక భాష లేదని చాలా మంది కవులు చెబుతుంటారు. నేటి ప్రపంచంలో దేశాల మధ్య, దేశ ప్రజల మధ్య సంబంధాలు ఎన్నో పెరిగాయి. చాలా మంది విదేశాలకు వెళ్లడానికి తపనపడుతున్నారు. అందుకు ఇంగ్లిషు నేర్చుకోవడం తప్పనిసరి అవుతుంది. దీంతో విద్యార్థులు తెలుగు భాషపై పట్టు కోల్పోతున్నారు. తెలుగు భాషను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని కవులు, కళాకారులు చెబుతున్నారు. మనం సమాజంలో ఎదిగేందుకు తల్లి ఎంత కృషి చేస్తుందో, అదే విధంగా మాతృభాష కూడా మన ఆహా భావాలు సరైన రీతిలో వ్యక్తపర్చటానికి తల్లిలా దోహదపడుతుంది. మాతృభాష తెలుగును జిల్లాలోని తెలుగు భాషా పండితులు, అదేవిధంగా కవులు అన్ని విధాలుగా ముందుకు తీసుకెళ్తున్నారు. ముఖ్యంగా మన భాషయాసను కాపాడటానికి తీవ్రంగా కృషి చేస్తున్నారు. నేటి ఆధునిక కాలంలో ప్రతీ తల్లిదండ్రులు తమ పిల్లలు ఇంగ్లిష్‌ మీడియంలో విద్యనభ్యసించాలని, ఇతర దేశాల్లో ఉద్యోగాలు చేయాలని తహతహలాడుతు, మన మాతృభాష రాకున్న ఫర్వాలేదు కాని ఇంగ్లిష్‌ రావాలనే తపనలో ఉన్నారు. దీంతో నేడు విద్యనభ్యసిస్తున్న అనేక మంది విద్యార్థులకు అటు ఇంగ్లిష్‌, ఇటు తెలుగు సక్రమంగా రాయడం, చదవడం రాని పరిస్థితులు నెలకొన్నాయి. ఇతర భాషలు నేర్చుకోవడంలో తప్పు లేదు, కానీ మాతృభాషను విస్మరించడమే తప్పు.



తెలుగు భాషాభివృద్ధికి కృషి

జిల్లాలోని అనేక మంది తెలుగు భాష పండితులు తాము వృత్తిరీత్యా పాఠశాలలో విద్యార్థులకు విద్యను బోధిస్తూనే తీరిక సమయంలో కవితలు, రచనలు రాస్తూ పుస్తకాల రూపంలో వెలువరించటం ద్వారా జిల్లాలో సాహితీ అభిమానులు తమ పిల్లలకు మాతృభాషపై పట్టు సాధించేలా దృష్టి సారిస్తున్నారు. సాయంత్రం సమయాల్లో ఉపాధ్యాయులు, కవులందరూ కలిసి కవి సమ్మేళనాలు, అష్టవధానాలు, తదితర ప్రక్రియలతో తెలుగు భాషాభివృద్ధికి తోడ్పాటునందించే విధంగా కార్యాచరణ అమలుపరుస్తున్నారు. జిల్లాలోని అనేక మంది ఉపాధ్యాయులు తెలుగు భాషలో బోధన చేస్తూ గుర్తింపు పొందారు. ఇందులో ముఖ్యంగా నాడు నందిని సిధారెడ్డి నుంచి మొదలుకొని నేటి వరకు అనేక మంది పాత, కొత్త తరం కవులు, రచయితలు జిల్లాలో తెలుగుభాషాభివృద్ధికి కృషి చేస్తున్నారు.

మాతృభాషను విస్మరించొద్దు



మనలో ఉన్న భావాలను స్వేచ్ఛగా అందించేది మన మాతృభాష. అలాంటి ఇటాలియన్‌ ఆఫ్‌ ద ఈస్ట్‌ అనే పేరు ప్రఖ్యాతి గాంచిన తెలుగు అజరామరం. బాలలైన వృద్ధులైన నేడు సిద్దిపేట సాహితీ లోకంలో విహరిస్తూ మాతృభాష కృషికి బాటలు వేస్తున్నారు. ఇది ఆహ్వానించదగిన విషయం. మాతృభాష అభివృద్ధి చెందాలంటే మన పిల్లలకు తెలుగు నేర్పడంలో మనం చొరవ తీసుకోవాలి. ఇతర భాషలను గౌరవిస్తూనే, మన మాతృభాషను విస్మరించొద్దు. ఇప్పటికి జిల్లాలో మాతృభాష అభివృద్ధికి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– ఉండ్రాళ్ల రాజేశం, బాలసాహితీవేత్త, సిద్దిపేట

మానవ సంబంధాలను ముడి వేస్తుంది



మాతృభాష చక్కని మాధుర్యానికి, పలుకుబడులకు, నుడికారాలకు పుట్టినిల్లు. మాతృభాష మమకారం మానవ సంబంధాలను ముడివేస్తుంది. నేడు అనేక మంది తమ కుటుంబాల్లో ఇతర భాషల్లో మాట్లాడుతున్నారు. దీంతో చిన్నారులకు ఇటు తెలుగు, ఇతర భాషలు పూర్తి స్థాయిలో మాట్లాడలేకపోతున్నారు. కేవలం మాతృభాష దినోత్సవం నాడే కాకుండా ప్రతి రోజూ మన మాతృభాష అభివృద్ధికి ముందుకు సాగాలి. మన మాతృభాషను కాపాడుకోవటం అందరి బాధ్యత. ఇతర భాషలు నేర్చుకున్నప్పటికీ మన భాషను విస్మరించద్దు.

–భామండ్ల రాజు, తెలుగు అధ్యాపకులు, సిద్దిపేట

గుర్తు తెలియని ఇద్దరు మహిళలు మృతి

సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రి వద్ద గుర్తింపు

సంగారెడ్డి క్రైమ్‌: సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. పట్టణ సీఐ రమేశ్‌ కథనం మేరకు.. గురువారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ప్రభుత్వాస్పత్రిలోని అత్యవసర ద్వారం వద్ద గుర్తు తెలియని మహిళ అపస్మారక స్థితిలో పడి ఉంది. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. ప్రభుత్వాస్పత్రి ఆవరణలో గల పలు దుకాణాల్లో భిక్షాటన చేసే మహిళగా పోలీసులు గుర్తించారు. మృతురాలి వయసు 50 నుంచి 52 ఏళ్ల వరకు ఉంటుందని తెలిపారు. సెక్యూరిటీ గార్డు కల్వగూరి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు తెలిస్తే 87126 56718 నంబర్‌కు ఫోన్‌ చేయాలని కోరారు. అలాగే మరో గుర్తు తెలియని మహిళ మృతి చెందిందని, ఆమె వయసు 45 నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటుందని తెలిపారు. సెక్యూరిటీ ఇన్‌చార్జి జాన్‌.డీ శాన్‌టిస్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

10 ఎకరాల తోట దగ్ధం


తోటలో చెలరేగుతున్న మంటలు

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రమాదవశాత్తు నిప్పంటుకొని తోట దగ్ధమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గోనెపల్లి గ్రామవాసి కూర మాధవరెడ్డికి చెందిన నీలగిరి తోటలో బుధవారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. స్థానికులు ఫైర్‌ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే ఫైర్‌ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలార్పారు. అప్పటికే 10 ఎకరాల తోట దగ్ధమైంది. సుమారు రూ. 5 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వ పరంగా నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.

హత్య కేసులో భార్య, అల్లుడు రిమాండ్‌


నిందితులను చూపుతున్న పోలీసులు

పాపన్నపేట(మెదక్‌): ఆశయ్యను హత్య చేసిన కేసులో నిందితులైన అతడి భార్య శివ్వమ్మ, అల్లుడు రమేశ్‌ను గురువారం రిమాండ్‌కు తరలించినట్లు మెదక్‌ రూరల్‌ సీఐ రాజశేఖర్‌ రెడ్డి,పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌ గౌడ్‌ తెలిపారు. ఆశయ్య శనివారం పొలం వద్ద జారి పడగా కాలు విరిగింది. ఆపరేషన్‌కు అయ్యే ఖర్చు భరించలేక, ఆపరేషన్‌ చేసినా నడిచి పొలం పనులు చేయలేడనే అనుమానంతో భార్య, అల్లుడు కలిసి ఆదివారం రాత్రి ఆశయ్యను ఉరేసి హత్య చేసిన విషయం తెలిసిందే. కేసులో భాగంగా ఇద్దరినీ అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు పంపినట్లు వివరించారు.

గురక తగ్గడం కోసం సర్జరీ

- మరుసటి రోజే వ్యక్తి మృతి
- వైద్యం వికటించి చనిపోయాడంటూ కుటుంబికుల ఆందోళన
- సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో ఘటన


శ్రీనివాస్‌ (ఫైల్‌)

సంగారెడ్డి: వైద్యం వికటించి వ్యక్తి మృతి చెందిన ఘటన సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రి వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కొండాపూర్‌ మండలం గారకుర్తి గ్రామానికి చెందిన వెల్దురి శ్రీనివాస్‌(47) నిద్రలో గురక బాగా వస్తోందని సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించాడు. వైద్యులు పరీక్షించి ముక్కులో బోన్‌ పెరిగిందని ఆపరేషన్‌ చేస్తే గురక తగ్గుతుందని చెప్పారు. దీనికి శ్రీనివాస్‌ ఒప్పుకోవడంతో బుధవారం సర్జరీ చేశారు. సర్జరీ అనంతరం రాత్రి శ్రీనివాస్‌ గుండెపోటుతో చనిపోయాడని కుటుంబ సభ్యులకు డాక్టర్లు చెప్పారు. ఇప్పటి వరకు ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి ఎలా చనిపోతాడని డాక్టర్లను నిలదీశారు. గురువారం ఉదయం మృతుడి బంధువులు న్యాయం చేయాలని ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు వచ్చి పరిస్థితిని అదుపుజేశారు. ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు టౌన్‌ సీఐ రమేశ్‌ కుమార్‌ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


బేతప్ప మృతదేహం

జహీరాబాద్‌: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని అల్గోల్‌ గ్రామంలో చోటు చేసుకుంది. రూరల్‌ పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఏర్పుల బేతప్ప(36) బుధవారం రాత్రి గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో కలిసి దుకాణానికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో తూలి కిందపడి తీవ్రంగా గాయపడినట్లు మృతుడితోపాటు ఉన్న వ్యక్తి పోలీసులు తెలిపాడు. గాయపడిన బేతప్పను రాత్రి వైద్యం నిమిత్తం జహీరాబాద్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. భార్య స్వప్న మాత్రం బేతప్ప మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వ్యాపారినని నమ్మించి

– రూ. 67,400 కాజేసిన వ్యక్తి

రామాయంపేట(మెదక్‌):ఆన్‌లైన్‌లో తక్కువ ధరకే శానిటరీ వస్తువులు ఇస్తామని వ్యాపారిని నమ్మించి మోసం చేశాడో ఓ వ్యక్తి. ఎస్‌ఐ బాల్‌రాజ్‌ తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన దోమకొండ రాములుకి శానిటరీ దుకాణం ఉంది. అతడికి ఆన్‌లైన్‌లో ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. తక్కువ ధరకే శానిటరీ వస్తువులు ఇప్పిస్తానని మభ్యపెట్టి విడతల వారీగా రూ.67,400 ఖాతాకు బదిలీ చేయించుకున్నాడు. మరి కొన్ని డబ్బులు వేయాలని పదే పదే ఒత్తిడి చేశాడు. దీంతో అనుమానం వచ్చి రాములు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

దుర్గమ్మ సేవలో నటుడు పూరి ఆకాశ్‌


ఆలయంలో ఆకాశ్‌

పాపన్నపేట(మెదక్‌): ఏడుపాయల దుర్గమ్మను ప్రముఖ చలన చిత్ర దర్శకుడు పూరి జగన్నాథ్‌ తనయుడు, నటుడు ఆకాశ్‌ గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆలయ చరిత్రను వివరించారు.

సూచిక కమాన్‌ను ఢీకొట్టిన డీసీఎం

కారుపై పడిపోవడంతో ఇద్దరికి గాయాలు


రోడ్డుపై పడిపోయిన కమాన్‌

తూప్రాన్‌, మనోహరాబాద్‌(తూప్రాన్‌): రోడ్డుపై ఏర్పాటు చేసిన సూచిక కమాన్‌ను డీసీఎం ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన మనోహరాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. హైదరాబాద్‌ నుంచి నిజామాబాద్‌ వైపు వెళ్తున్న డీసీఎం మండలంలోని రామాయపల్లి శివారులో అదుపుతప్పి సూచిక కమాన్‌ను ఢీకొట్టింది. అదే సమయంలో ఒంగోలుకు చెందిన ప్రశాంత్‌ గణేశ్‌, మిత్రురాలు ప్రత్యూషతో కలిసి స్నేహితుడి వివాహం కోసం కామారెడ్డి వెళ్తున్నారు. అడ్రస్‌ కోసం రోడ్డు పక్కన కారు నిలిపి మ్యాప్‌ చూస్తున్నారు. డీసీఎం ఢీకొట్టగా కమాన్‌ ఒరిగి వీరి కారుపై పడిపోయింది. ప్రత్యూషకు, డీసీఎం డ్రైవర్‌ మహ్మద్‌ అలీంకు గాయాలయ్యాయి. కారు యజమాని గణేశ్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తూప్రాన్‌ ఎస్‌ఐ శివానందం తెలిపారు.

యువకుడి దారుణ హత్య

- సిద్దిపేట పట్టణంలో ఘటన
- పరిశీలించిన ఏసీపీ మధు, సీఐ ఉపేందర్‌


శ్రీను (ఫైల్‌)

సిద్దిపేటకమాన్‌: గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో వ్యక్తి హత్యకు గురైన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్‌ సీఐ ఉపేందర్‌ కథనం ప్రకారం.. సిద్దిపేట పట్టణం డబుల్‌ బెడ్రూం ఇళ్లలో నివాసం ఉంటున్న బోదాసు శ్రీను (29)కు సంధ్యతో 2014లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పని నిమిత్తం భార్య సంధ్య పిల్లలతో హైదరాబాద్‌లో ఉంటుండగా శ్రీను సిద్దిపేటలోని డబుల్‌ బెడ్రూం ఇళ్లలో ఉంటున్నాడు. పట్టణంలోని నర్సాపూర్‌ రోడ్డులో నిర్మాణంలో ఉన్న ఇంటిలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శ్రీనుపై దాడి చేసి హత్య చేశారు. గురువారం తెల్లవారుజామున ఇంటి యజమాని మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకున్న సిద్దిపేట ఏసీపీ మధు, సీఐ ఉపేందర్‌ మృతదేహాన్ని పరిశీలించి, చుట్టుపక్కల వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘటనా స్థలంలో డాగ్‌ స్క్వాడ్‌, క్లూస్‌ టీమ్‌ సిబ్బంది వేలి ముద్రలు సేకరించారు. మృతుడికి నేర చరిత్ర ఉందని, అతడిపై పలు కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. శ్రీను తలపై రక్తపు గాయాలు ఉండడంతోపాటు ఘటనా స్థలంలో కర్రను స్వాధీనం చేసుకున్నారు. మృతుడి భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


పరిశీలిస్తున్న ఏసీపీ మధు, సీఐ ఉపేందర్‌


కళాశాలలో ఎలక్ట్రిక్‌ బగ్గీల వద్ద విద్యార్థులు

డిజిటల్‌ ఇంజనీరింగ్‌కు ప్రోత్సాహం

- రెనాల్ట్‌ గ్రూప్‌ హెచ్‌ఆర్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ సిమోనా అడెలీనా
- బాహా సే ఇండియా–2025 పోటీలు

నర్సాపూర్‌ : ప్రపంచ వ్యాప్తంగా తమ సంస్థ డిజిటల్‌ ఇంజనీరింగ్‌కు ప్రోత్సాహాన్ని అందిస్తుందని రెనాల్ట్‌ గ్రూప్‌ (ఆసియా) హెచ్‌ఆర్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ సిమోనా అడెలీనా అన్నారు. గురువారం బీవీ రాజు ఇంజనీరింగు కాలేజీలో జాతీయ స్థాయి ఈ బాహ సే ఇండియా–2025 పోటీలు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా సిమోనా అడెలీనా హాజరై మాట్లాడారు. డిజిటల్‌ ఇంజనీరింగ్‌కు తమ సంస్థ అందజేస్తున్న ప్రోత్సాహాన్ని ఆమె వివరిస్తూ ఇంటర్న్‌షిప్‌, ఉపాధి అవకాశాలు అందజేసే ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సొసైటీ ఆఫ్‌ ఆటోమోటీవ్‌ ఇంజనీర్స్‌ ఇండియా (ఎస్‌ఏఈ) చైర్మన్‌ బాల్‌రాజ్‌ సుబ్రమణ్యం, బాహా సే ఇండియా సలహాదారుడు డాక్టర్‌ కేసీ వోరా, విష్ణు ఎడ్యుకేషనల్‌ సొసైటీ వైస్‌ చైర్మన్‌ రవి చంద్రన్‌ రాజగోపాల్‌, ఆటోకార్‌ ప్రొఫెషనల్‌ అసిస్టెంట్‌ ఎడిటర్‌ మయాంక్‌ డింగ్రా, బీపీసీఎల్‌ హైదరాబాద్‌ టెరిటరీ మేనేజర్‌ శ్రావణ్‌ కుమార్‌, ఈ బాహ సే ఇండియా జాయింట్‌ కన్వీనర్‌ మనోనిత్‌ సింగ్‌, తదితరులు పాల్గొని తమ సంస్థలకు ఈ బాహాతో ఉన్న సంబంధాలను వివరించారు. విద్యార్థులనుద్దేశించి సొసైటీ చైర్మన్‌ విష్ణురాజు పంపిన వీడియో మేసేజ్‌ను వినిపించారు. ఐదు రోజులపాటు కార్యక్రమం జరుగుతుందని, 15 రాష్ట్రాల నుంచి 80 జట్లు పాల్గొన్నాయని కాలేజీ డైరెక్టర్‌ లక్ష్మిప్రసాద్‌ తెలిపారు. ఇందులో కాలేజీ ప్రిన్సిపాల్‌ సంజయ్‌దూబె, ఆయా బ్రాంచ్‌ల హెచ్‌ఓడీలు, ఇతర ప్రతినిధులు బాపిరాజు, సురేశ్‌, కాంతారావు, రాయుడు, దశరథరామయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హత్యా రాజకీయాలకు పాల్పడుతున్న బీఆర్‌ఎస్‌

దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

నర్సాపూర్‌ : అధికారం కోల్పోవడంతో బీఆర్‌ఎస్‌ నాయకులు కేటీఆర్‌, హరీశ్‌రావు హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నారని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం నర్సాపూర్‌కి వచ్చి విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ హయాంలో జరిగిన అవినీతిని ప్రశ్నించినందుకు లింగమూర్తి అనే వ్యక్తిని బీఆర్‌ఎస్‌ నాయకులు హత్య చేయించారని, స్వయాన మృతుడి కూతురు బీఆర్‌ఎస్‌ నాయకులపై ఆరోపణలు చేసినట్లు గుర్తు చేశారు. అధికారం అడ్డం పెట్టుకొని బీఆర్‌ఎస్‌ నాయకులు కేసీఆర్‌, కేటీఆర్‌, హరీశ్‌రావులు అడ్డగోలుగా దోచుకున్నారని ఆరోపించారు. ప్రజల ఆస్తులను కాపాడేందుకు ప్రయత్నించే వ్యక్తులను చంపడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. నీళ్లు నిధులు, నియామకాలపై ప్రత్యేక తెలంగాణ ఉద్యమం సాగిందని అవన్నీ కేసీఆర్‌ కుటుంబానికే దక్కాయని విమర్శించారు. కాంగ్రెస్‌ పార్టీ బలపర్చిన పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించేందుకు పార్టీ నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కోరారు. ఆయన వెంట పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌ సుహాసినిరెడ్డి, తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


కృష్ణ మృతదేహం

దుబ్బాకటౌన్‌ : విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందాడు. ఈ ఘటన రాయపోల్‌ మండలం ఎల్కల్‌ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. బేగంపేట ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన పిట్ల కృష్ణ (40) వ్యవసాయం చేసుకుంటూ భార్య, కుమారుడు, కుమార్తెతో జీవనం సాగిస్తుంటాడు. అదే గ్రామానికి చెందిన మరో రైతు భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. బోరు మోటార్‌ రిపేర్‌కి రావడంతో విద్యుత్‌ సరఫరాను నిలిపివేయడానికి ట్రాన్స్‌ఫార్మర్‌ ఆఫ్‌ చేయడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. చుట్టుపక్కల రైతులు గమనించి చికిత్స నిమిత్తం హుటాహుటిన గజ్వేల్‌ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు కృష్ణ అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి భార్య పిట్ల లలిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఫ్యాన్‌ మరమ్మతు చేస్తుండగా షాక్‌


నర్సయ్య (ఫైల్‌)

రామాయంపేట(మెదక్‌): సీలింగ్‌ ఫ్యాన్‌కు మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని లక్ష్మాపూర్‌లో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన పొట్టినోళ్ల నర్సయ్య (55) ఇంటిలో పాడైపోయిన ఫ్యాన్‌ను మరమ్మతు చేస్తున్నాడు. ఈ క్రమంలో కరెంటు వైరు తగిలి కింద పడిపోయాడు. వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో 15 గొర్రెలు మృతి


మృతి చెందిన గొర్రెలు

కౌల్దారం(నర్సాపూర్‌): గుర్తు తెలియని వాహనం ఢీకొని గొర్రెలు మృతి చెందగా, కాపరి కాలు విరిగింది. ఈ ఘటన మండల కేంద్రం సమీపంలోని మెదక్‌–నర్సాపూర్‌ జాతీయ రహదారిలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మెదక్‌ పట్టణం దాయర వీధికి చెందిన వెంకయ్య నెల రోజుల కిందట గొర్రెలను సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లి మేతమేపి స్వగ్రామానికి తిరుగొస్తున్నాడు. రాత్రి ఒంటిగంట ప్రాంతంలో హనుమాన్‌ బండల్‌ సమీపంలోకి రాగానే ఎదురుగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 15 గొర్రెలు మృతి చెందగా, వెంకయ్య కాలు విరిగింది. అటువైపుగా వెళ్తున్న వారు కౌల్దారం పోలీసులకు సమాచారం అందించడంతో గాయపడ్డ వెంకయ్యను చికిత్స నిమిత్తం మెదక్‌ ఏరియాస్పత్రికి తరలించారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

నిందితులను పట్టుకున్న లింగారెడ్డిపేట్‌ గ్రామస్తులు

మనోహరాబాద్‌(తూప్రాన్‌): మనోహరాబాద్‌ మండలంలోని లింగారెడ్డిపేట్‌ గ్రామ శివారులో హైదరాబాద్‌కు చెందిన కొందరు వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వకాలు చేస్తుండగా గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. బుధవారం గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులో ఐదుగురు మగవారు, ఓ మహిళ కలిసి గుప్త నిధుల కోసం పూజలు చేసి తవ్వకాలు చేపట్టారు. ఇది గమనించిన ఓ రైతు గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో వెళ్లి పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చి అప్పజెప్పారు. ఈ విషయంపై ఎస్‌ఐ సుభాష్‌గౌడ్‌ను వివరణ కోరగా నిజమేనని విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.